

# జీవిత చక్రం నగలో చిత్రం!

సీతాకోకచిలుక ఓ అద్భుతం. కదలలేని పురుగు నుంచీ ఎగిరే చిలుకగా మారేదాకా సాగే దాని జీవిత కథ ఓ అపురూపం. పరివర్తన అన్నది ఎంత అందంగా ఉంటుందో చూపించాలంటే సీతాకోకచిలుక జీవిత చక్రం చూపిస్తే చాలు. మరి అంత ప్రత్యేకమైన విషయాన్ని ఎందుకు విస్మరించాలి అనుకున్నారో ఏమో... 'బటర్ ఫ్లై లైఫ్ సైకిల్ జువెలరీ' తయారు చేస్తున్నారు వినూత్నతకు పెద్దపీట వేసే ఫ్యాషన్ డిజైనర్లు.

గొంగళి పురుగు, ప్యూపా, లార్వా దశలు, సీతాకోకచిలుక రూపం... ఇలా దాని కథంతా కళ్లకు కట్టినట్టు కనిపించేలా ట్రెండీ నగల్ని రూపొందిస్తున్నారు. గొలుసులు, లాకెట్లు, చెవి పోగుల్లో ఈ చక్రాన్ని అమర్చి విభిన్నమైన నగలకు రూపకల్పన చేస్తున్నారు. అందమంటే ఒక్క సీతాకోకచిలుకదే కాదు, దాని చరిత్రదీ అని చెప్పే ప్రయత్నం చేస్తున్నారు.









నమస్తే తెలంగాణ
జిందగీ
శనివారం | 29 మార్చి 2025
హైదరాబాద్ | www.ntnews.com
13

# ప్రతిభకు పట్టం

**గ్రూప్స్ కొట్టాలనే లక్ష్యం ఎందరికో ఉంటుంది! గమ్యం దూరమని తెలుసు! ప్రయాణం భారమనీ తెలుసు!! కానీ, ఈ జర్నీలో ఒత్తిడితో ఎప్పుడూ పేచీ ఉంటుంది. సబ్జెక్టుపై పట్టు సాధించినా.. స్ట్రెస్‌తో చేతులెత్తేసే వాళ్లే ఎక్కువ మంది ఉంటారు. పోలం ప్రతిభా శేఖర్ ప్రతిభ అందుకు విరుద్ధం. ఆమె తన ప్రతిభను నమ్ముకుంది. సిలబస్ మీద ధ్యాస, జీవితం మీద ప్రేమతో చదివి ప్రతికూలతలన్నిటినీ జయించింది. గ్రూప్ 1, గ్రూప్2, గ్రూప్3, గ్రూప్ 4 ఇలా నాలుగు పోటీ పరీక్షల్లో విజేతగా నిలిచింది. అమ్మానాన్నల అండదండలు ఉంటే ఆడపిల్ల అన్నిటా గెలుస్తుందన్న ప్రతిభ గెలుపు కథ ఆమె మాటల్లోనే..**

మా అమ్మానాన్నకు నేనొక్కదాన్నే! అమ్మ రాష్ట్ర ఆర్థికశాఖలో ఉద్యోగి. నాన్న ఎల్ఐసీలో పనిచేస్తున్నారు. సెలవుల్లో అమ్మ నన్ను కూడా తన వెంట ఆఫీస్‌కు తీసుకెళ్లేది. సెక్రటేరియట్‌లో ఐఏఎస్ అధికారులను చూశాక.. పెద్ద ఆఫీసర్ కావాలనే కోరిక పుట్టింది. బట్టీ పట్టడం నాకు నచ్చదు. నాలెడ్జ్ ముఖ్యం అనుకునేదాన్ని. క్లాస్‌లో ఎప్పుడూ ఫస్ట్ నేనే! మా స్కూల్ (సెయింట్ ఆన్స్, బొల్లారం)లో వ్యాస రచన, వక్తృత్వం, క్విజ్ కాంపిటిషన్స్‌లో ఎన్ని ప్రైజ్‌లు వచ్చాయో! స్కూల్ కెప్టెన్‌గానూ పనిచేశాను. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వరంగల్)లో బీటెక్ చదివాను. అక్కడే ఒక షోకు హోస్ట్‌గా చేశాను. ఆ వీడియో అమ్మ చూస్తుంటే.. భాష, సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ గారు చూశారట! 'ఎవరీ అమ్మాయి?' అని అడిగితే.. 'మా అమ్మాయే' అని చెప్పిందట. చాలా బాగా మాట్లాడుతున్నదని, సెలవులకు వస్తే ఓసారి రవీంద్రభారతికి తీసుకురమ్మన్నారట. ఆయన్ని కలిసినప్పుడు ఏం చేయాలని అనుకుంటున్నావని అడిగారు. సివిల్స్‌కి ప్రిపేర్ అవుతానని చెప్పాను. 'ఇది చదివి నెల రోజుల తర్వాత కలువు' అంటూ నా చేతిలో ఒక పుస్తకం పెట్టారు. చదివాను. దాని గురించి ఆయనతో చర్చించాను. సివిల్స్ రాయడానికి ఫిట్ అవుతానని మావాళ్లతో చెప్పారు.

## సెల్ఫ్ లెర్నింగ్

ప్రపంచమంతా కరోనా గుప్పిట్లో ఉన్న రోజుల్లో సివిల్స్ పరీక్షకు సిద్ధమయ్యాను. కోచింగ్ సెంటర్లన్నీ మూతపడ్డాయి. ఏ పుస్తకాలు చదవాలో తెలియదు. హరికృష్ణ సార్‌ని కలిశాను. ఏ సబ్జెక్ట్‌కి ఏ పుస్తకం చదవాలో చెప్పారు. పుస్తకాలు తెచ్చుకోవడం, సబ్జెక్ట్ గురించి తెలుసుకోవడంలోనే ఏడాది గడిచింది. కరోనా సెకండ్ వేవ్‌లో సీరియస్‌గా చదవడం మొదలుపెట్టాను. ఇంతలో తెలంగాణ ప్రభుత్వం గ్రూప్ 2 ప్రకటన వచ్చింది. అదీ రాయాలనుకున్నాను. అప్పటికే కోచింగ్ సెంటర్లు తెరుచుకున్నాయి. కానీ, సొంత ప్రిపరేషన్ బాగానే ఉందని వాటి జోలికి వెళ్లలేదు. సిలబస్ మొత్తాన్నీ టాపిక్‌ల వారీగా విడగొట్టాను. రోజుకు ఇన్ని గంటలు చదవాలనే నియమం పెట్టుకోలేదు. రోజుకు ఇన్ని టాపిక్స్ చదవాలనుకున్నాను. మొదట్లో అనుకున్న టాపిక్ పూర్తి కావడానికి రోజుకు ఏడెనిమిది గంటలు పట్టేది. అర్థంకాక ఇంకొన్ని పుస్తకాలు చదివాను. ఇంటర్నెట్‌లో వెదికాను. యూట్యూబ్‌లో విన్నాను. కొన్నాళ్లకు రోజుకు నాలుగు, అయిదు గంటల్లోనే టాపిక్ పూర్తయ్యేది. యూపీఎస్సీ ప్రిలిమ్స్‌కి ఇండియన్ జాగ్రఫీ, ఇండియన్ పాలిటీ, ఇండియన్ హిస్టరీ చదివితే సరిపోతుంది. కానీ, టీఎస్‌పీఎస్సీ గ్రూప్ 1 ఉద్యోగానికి అదనంగా తెలంగాణ చరిత్ర, ఉద్యమం చదవాలి. పాఠ్యపుస్తకాల్లో తెలంగాణ చరిత్ర లేదు. అందుకని తెలంగాణ ఉద్యమ చరిత్ర కోసం ఎక్కువ సమయం కేటాయించాను.

### అమ్మ మాట

"మా అమ్మాయికి ఎన్నడూ ఆంక్షలు లేవు. అన్నీ ఆకాంక్షలే. సుకుమారంగా పెంచలేదు. ఆడపిల్లకు స్వేచ్ఛ ఉండాలి. అదొక్కటే మేమిచ్చాం. తనకాళ్లపై తాను నిలబడాలని మా కోరిక. పెండ్లి తర్వాత కూడా ఒకరిపై ఆధారపడకూడదు. ఎక్కడికి వెళ్తానన్నా ప్రోత్సహించాం.

• సుజాతా శేఖర్, తల్లి

### నాన్న మాట

ప్రతిభ బీటెక్ పూర్తయినప్పటి నుంచి 'మీ అమ్మాయి ఇంకా జాబ్ ఎందుకు చేయడం లేద'ని కనిపించిన వాళ్లంతా అడిగేవారు. గ్రూప్స్‌కి ప్రిపేర్ అవుతోందంటే మమ్మల్ని పిచ్చోళ్లన్నట్టుగా చూసేవారు. 'సర్కార్ నౌకరీ వస్తుందని కలలు కంటే ఎట్లా.. మంచి సాఫ్ట్‌వేర్ ఉద్యోగానికి పంపించొచ్చు కదా!' అని కాస్త హేళనగా సలహాలిచ్చేవారు. 'గ్యాప్ వస్తే.. 'ఔట్ డేటెడ్' అని సాఫ్ట్‌వేర్ జాబ్ కూడా రాదు' అనేవారు. వాళ్లతో వేగలేక కొన్నాళ్లు ఫోన్లు ఎత్తడం, ఫంక్షన్లకు వెళ్లడం మానేశాం."

• పి.ఆర్. శేఖర్, తండ్రి



## జాయ్‌ఫుల్ లెర్నింగ్

పోటీ పరీక్షలు ప్రతిభకే కాదు సహనానికీ పరీక్షే! అనుకున్న ప్రకారం సిలబస్ పూర్తి కాకపోతే ఒత్తిడి పెరుగుతుంది. నిరుత్సాహం ఆవహిస్తుంది. వాటిని అధిగమించడానికి ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్ ఉండాలి. ఒత్తిడి అధిగమించడానికి నేను ఈ మార్గాన్ని ఎంచుకున్నాను. శ్రీశ్రీ, మీర్జా గాలిబ్, ఖలీల్ జిబ్రాన్ కవిత్వం చదివేదాన్ని. ఉర్దూ, హిందీ, ఇంగ్లిష్‌లో కవిత్వం రాసేదాన్ని. హిందీ-ఉర్దూ కవితా సంకలనం కూడా ఒకటి ప్రచురించాను. సినిమాలు చూశాను. సోలో ట్రావెల్ చేశాను. ఫ్యామిలీతో, ఫ్రెండ్స్‌తో విహార యాత్రలకు వెళ్లాను. ఫొటోగ్రఫీ చేశాను. డ్రాయింగ్ గీశాను. వారంలో అయిదు రోజులు చదువుకుంటే.. రెండు రోజులు ట్రావెల్‌లో గడిపేదాన్ని. దీంతో స్ట్రెస్ ఫీలింగే రాలేదు.

## డిప్రెషన్‌ని ఓడిస్తే.. గెలిచినట్టే

యూపీఎస్సీ ప్రిలిమ్స్ రెండుసార్లు రాశాను. ఎస్.ఎస్.సి. పరీక్ష కూడా రాశాను. ఏదీ రాలేదు. మానసికంగా కుంగిపోయాను. నెల రోజులు ఏ పనీ చేయలేదు. ఇలాగే ఉండిపోతే ఏం సాధించలేం అనిపించింది. ఓటమి నుంచి పాఠం నేర్చుకున్నాను. గ్రూప్ 1 మీద ఫోకస్ చేశాను. వ్యాస రచన, విశ్లేషణలో హరికృష్ణ గారి సూచనలతో నైపుణ్యం సాధించాను. మాక్ పరీక్షలు రాశాను. మూల్యాంకనంలో ఏ అంశాలకు ఎక్కువ మార్కులు ఇస్తున్నారో గుర్తించాను. ఎక్కడ తప్పులు చేశానో అమిగోస్‌లో రఫీ సార్ విశ్లేషించారు. నోటిఫికేషన్లు, కోర్టు తీర్పులు, పరీక్ష రద్దు ఇవేవీ పట్టించుకోకుండా చదువుకోవడంపైనే ఫోకస్ చేశాను. అంతిమంగా గెలిచాను.

| | |
|---|---|
| గ్రూప్ 1 స్కోర్ | 483.5 |
| గ్రూప్ 2 ర్యాంక్ | 746 |
| గ్రూప్ 3 ర్యాంక్ | 160 |
| గ్రూప్ 4 ర్యాంక్ | 921 |

## ఆడపిల్లకు కావాల్సింది

ఈ ప్రయాణంలో అమ్మానాన్న నన్నెంతగానో ప్రోత్సహించారు. మా బంధువుల్లో చాలామంది 'ఎన్ఐటీలో చదివింది. నాలుగేళ్లయినా జాబ్ లేదు. ఇంట్లో కూర్చోబెట్టి కాంపిటీటివ్ పరీక్షలకు చదివిస్తున్నారేంటి? ఆడపిల్లకు విహారాలేంటి?' ఇలా ఎన్నో మాటలు అన్నారు. ఆ మాటలకు నేనెంత బాధపడ్డానో, అమ్మానాన్న కూడా అంతే ఇబ్బందిపడ్డారు. ఈ ఒత్తిడి అధిగమించడానికి బయటికి వెళ్తానంటే.. ఓకే అన్నారు. 'నాలెడ్జ్ కేవలం పుస్తకాల్లోనే కాదు బయటి ప్రపంచంలో కూడా ఉంద'ని చెప్పారు. అంతేకానీ, ఎవరి మాటలకో భయపడి గడప దాటొద్దని అనలేదు. ఈ ప్రిపరేషన్‌లో నేనెంత స్ట్రగుల్ అయ్యానో, మా పేరెంట్స్ కూడా అంతే స్ట్రెస్ అనుభవించారు. అమ్మానాన్న గర్వపడేలా చేయాలన్నదే నా డ్రీమ్. గ్రూప్స్ ఫలితాలు వచ్చిన రోజు నా కల నెరవేరింది అనిపించింది.

... నాగవర్ధన్ రాయల
గడసంతల శ్రీనివాస్

రోజురోజుకూ ఎండలు మండిపోతున్నాయి. జనాల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. వాతావరణంలో వస్తున్న మార్పులతో.. అనేక ఆరోగ్య సమస్యలూ పలకరిస్తున్నాయి. చాలామందిలో వేసవిలో వేడికారణంగా వాంతులు, వికారం, తలనొప్పి, అజీర్ణం వంటి సమస్యలు మొదలవుతాయి. ఇలాంటి సమయంలో కొన్ని ఆహారపదార్థాలు.. వేసవి వేడికి విరుగుడుగా పనిచేస్తాయి. వీటిని క్రమం తప్పకుండా తీసుకుంటే.. మీ కడుపును చల్లగా ఉంచుతాయి.

# వేసవి వేడికి విరుగుడు..

## కడుపులో వేడికి కారణాలు

కొన్ని ఆహారపు అలవాట్లు.. వేసవిలో కడుపులో వేడిని పెంచేస్తాయి. వంటల్లో కారం ఎక్కువగా వాడటం, మాంసాహారం, ధూమపానంతోపాటు టీ, కాఫీలు అతిగా తీసుకోవడం, సరైన సమయంలో తినకపోవడంతోపాటు కొన్నిరకాల మందులు కూడా కడుపులో వేడి పెరగడానికి కారణం అవుతాయి.

## జాగ్రత్తలు

వేసవిలో ఆహారపు అలవాట్ల విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. ఈ సీజన్‌లో తేలికగా జీర్ణమయ్యే ఆహారాన్ని తీసుకోవాలి. నూనెలో వేయించినవి, కారంగా ఉండే ఆహార పదార్థాలను తగ్గించాలి. పూర్తిగా మానేస్తే ఇంకా మంచిది. ఉదయం ఖాళీ కడుపుతోనే గోరువెచ్చని నీరు తాగాలి. నిద్రలేచిన 1-2 గంటల్లోపే అల్పాహారం తీసుకోవాలి. ఎక్కువ సమయంపాటు ఖాళీ కడుపుతో ఉండకూడదు. ఇక రోజంతా నీరు తాగుతూనే ఉండాలి.

## ఇవి తీసుకుంటే చాలు..

**పుదీనా:** వేసవిలో పుష్కలంగా లభించే తాజా పుదీనాను ఆహారంలో భాగం చేసుకోవాలి. పుదీన నీళ్లు తాగినా.. కడుపులో ఆమ్లం ఇట్టే తగ్గిపోతుంది.



**తులసి ఆకులు:** బ్రష్ చేసిన వెంటనే.. రెండుమూడు తులసి ఆకులను నమిలి మింగేయాలి. ఖాళీ కడుపుతో తులసి ఆకులను నమలడం వల్ల కడుపులో నీటి పరిమాణం పెరుగుతుంది. కడుపులో ఆమ్లాన్ని తగ్గిస్తుంది. తులసి ఆకులతో టీ చేసుకొని తాగినా.. మంచి ఫలితాలు కనిపిస్తాయి.

**సోంపు:** కడుపును చల్లగా ఉంచడంలోనూ, వేడిని తగ్గించడంలో సోంపు సమర్థంగా పనిచేస్తుంది. భోజనం తర్వాత కాస్త సోంపు నమిలితే.. కడుపులో చికాకు తగ్గుతుంది. సోంపు నీటిని కూడా తాగవచ్చు.



**అరటిపండు:** వేసవిలో ప్రతి రోజూ ఒక అరటిపండు తినాలి. వీటిలో అధిక మొత్తంలో లభించే పొటాషియం.. కడుపులో ఆమ్లాన్ని నియంత్రించడంలో సహాయపడుతుంది. వేడి నుంచి ఉపశమనం కలిగిస్తుంది.



**పాలు:** వేసవిలో వేడి పాలు నచ్చకుంటే.. చల్లని పాలే తాగాలి. అల్పాహారంగా ప్రతిరోజూ ఒక కప్పు చల్లని పాలు తాగితే.. ఆరోగ్యానికి భరోసా దక్కుతుంది. ఇందులోని కాల్షియం.. కడుపు వేడిని తగ్గిస్తుంది. చల్లదనాన్ని అందిస్తుంది.



# [illegible]

బిజీబిజీ జీవితం! అంతా.. గజిబిజి గందరగోళం! తీరికలేని పని.. మానసిక ఒత్తిడిని పెంచేస్తున్నది. అనారోగ్యానికి ఆహ్వానం పలుకుతున్నది. తగినంత విశ్రాంతి దొరక్క.. మన శ్శాంతి దూరమైపోతున్నది. మొత్తంగా.. కంటినిండా నిద్రే కరువైపోతున్నది. ఇలాంటి వాళ్లందరికీ ఓ ప్రత్యేకమైన గమ్యస్థానం ఉన్నది. అదే.. స్లీప్ టూరిజం! అంటే.. కేవలం నిద్రపోవడానికే టూర్‌కు వెళ్లడం.

టూర్‌కు వెళ్లడమంటే.. నచ్చిన ప్రదేశాలను సందర్శించడం. చరిత్రాత్మక ప్రాంతాలను చుట్టిరావడం. గుళ్లగోపురాలను దర్శించడం. గుట్టలు ఎక్కిదిగడం. బీచ్‌లలో ఎంజాయ్ చేసి రావడం. ఇంతే! కానీ, ఈ స్లీప్ టూరిజం అందుకు పూర్తిగా భిన్నం! కేవలం విశ్రాంతి తీసుకోవడానికే ప్రాధాన్యమిస్తూ.. వివిధ ప్రాంతాలను సందర్శించడమే ఈ 'స్లీప్ టూరిజం'. దీన్నే 'డ్రీమ్ టూరిజం' అని కూడా పిలుస్తున్నారు. పని ఒత్తిడితో మానసికంగా చిత్తయిపోతున్న వాళ్లంతా.. ఇప్పుడు 'స్లీప్ టూరిజం' బాట పడుతున్నారు. ఆనందంతోపాటు ఆరోగ్యాన్నీ వెతుక్కుంటూ ప్రకృతి ఒడిలోకి ప్రయాణాలు కడుతున్నారు. అలా వందలో వేలలో కాదు.. కమ్మటి నిద్ర కోసం ఏటా లక్షలాది మంది లక్షలు ఖర్చుపెడుతున్నారు. ఉరుకుల పరుగుల జీవితానికి కొన్నిరోజులు కామా పెట్టేసి.. కామ్‌గా పడుకుండి పోతున్నారు. తమకు తామే ఫుల్‌రీచార్జ్ అవుతూ.. ఒత్తిడిని చిత్తు చేసుకుంటున్నారు. స్లీప్ టూరిజం చేసేవాళ్లు ఆహ్లాదకరమైన ప్రకృతి అందాలను ఆస్వాదిస్తున్నారు. ప్రకృతికి దగ్గరగా జీవిస్తూ.. మానసిక ప్రశాంతతను పొందుతున్నారు. ఇలాంటి టూర్లలో ఎక్కువగా యోగా సెషన్లు, స్విమింగ్, స్పా చికిత్సలు, ఆరోగ్యకరమైన భోజనంతోపాటు నిద్రకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఆయా ప్రాంతాల్లోని హోటల్స్ నిర్వాహకులు కూడా వీరికి తగిన సౌకర్యాలను కల్పిస్తున్నారు. అతిథులకు నిద్రాభంగం కలగకుండా.. గదులను సౌండ్‌ప్రూఫ్‌గా మార్చేస్తున్నారు. తాజాగా, ఈ ట్రెండ్‌పై స్కైస్కానర్ సంస్థ ఓ సర్వే నిర్వహించింది. ఈ సందర్భంగా 70 శాతం మంది భారతీయులు స్లీప్ టూరిజానికి ఆసక్తి చూపుతున్నారని తేల్చింది. వీరిలో 57 శాతం మంది సెలవు దినాల్లో ఆరోగ్యానికే తొలి ప్రాధాన్యం ఇస్తున్నారని వెల్లడించింది.



# వాసన.. వాపస్!

**వేసవిలో చెమట పట్టడం కామన్! ఫలితంగా, బూట్ల నుంచి దుర్వాసన రావడం కూడా మామూలు విషయమే! అయితే, కొన్ని చిట్కాలు పాటిస్తే.. ఈ సమస్యకు చెక్ పెట్టవచ్చు. వాసనను వాపస్ పంపించొచ్చు.**

**ఎండలో ఉంచడం:** ఎక్కడికైనా వెళ్లినప్పుడు బూట్లను విప్పేసి కబోర్డ్‌లో ఉంచేస్తారు. అలాకాకుండా.. బూట్లను ఎండలో వదిలేయండి. వాటిలో పేరుకుపోయిన బ్యాక్టీరియాను నిర్మూలించడంలో సూర్యరశ్మిని మించింది లేదు.

**సాక్స్:** బూట్ల నుంచి ఎక్కువగా దుర్వాసన రావొద్దంటే.. ఎప్పుడూ సాక్స్ ధరించాలి. వాటినీ ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకుంటూ ఉండాలి.

**వెనిగర్:** ఒక లీటర్ స్ప్రే బాటిల్‌లో సగం వెనిగర్, ఇంకా సగం నీళ్లు నింపుకోవాలి. బూట్లను శుభ్రం చేసిన తర్వాత.. ఈ మిశ్రమాన్ని బూట్ల లోపల స్ప్రే చేసుకోవాలి. కాసేపు నీడలో ఆరబెడితే.. బూట్లలోంచి దుర్వాసన వదిలిపోతుంది.

**వంట సోడా:** బూట్లలో తేమతోపాటు బ్యాక్టీరియాను నిర్మూలించడంలో వంటసోడా చాలా గొప్పగా పనిచేస్తుంది. బూట్లలో కొద్దిగా బేకింగ్ సోడా చల్లి.. రాత్రంతా అలాగే ఉంచాలి. ఉదయాన్నే పాత బ్రష్‌తో బూట్లను శుభ్రంగా కడిగేయాలి. దుర్వాసన ఆమడదూరం పారిపోతుంది.

**లవంగం నూనె:** 2007లో మైక్రోబయాలజీ అనే జర్నల్‌లో ప్రచురితమైన ఒక అధ్యయనం ప్రకారం.. లవంగం నూనెకు బ్యాక్టీరియా వ్యాప్తిని నిరోధించే సుగుణాలు ఉన్నాయి. ఇది సువాసనను కూడా వెదజల్లుతుందని వెల్లడైంది. దీంతోపాటు టీట్రీ ఆయిల్, దేవదారు నూనెలు కూడా బూట్లలోంచి వచ్చే చెడు వాసనను తొలగించడంలో ఉపయోగపడతాయి.

## సామ్‌సంగ్ కొత్త 'యూఐ'

హార్డ్‌వేర్‌లో ఎన్ని మార్పులు చేసినా.. సరైన సాఫ్ట్‌వేర్ ఇంటర్‌ఫేస్ లేకపోతే ఏం ప్రయోజనం! యూజర్లను ఆకట్టుకోవడం కష్టమే. ఈ విషయంలో నిత్యం అలర్ట్‌గా ఉండే సామ్‌సంగ్ కొత్తగా One UI 7 యూజర్ ఇంటర్‌ఫేస్ విడుదల చేయనుంది. ఏప్రిల్ 7 నుంచి Galaxy S24 సిరీస్, Galaxy Z Fold6, Z Flip6 డివైజ్‌లకు అప్‌డేట్ అందుబాటులోకి రానుంది. ఆ తర్వాత ఇతర Galaxy ఫోన్లు, ట్యాబ్లెట్లకు కూడా రోలౌట్ చేయనున్నారు. కొత్త One UI 7లో డిజైన్ మార్పులు, AI ఆధారిత స్మార్ట్ ఫీచర్లు, మరిన్ని పర్సనలైజేషన్ ఆప్షన్లు అందుబాటులోకి రానున్నాయి.

